# ఏడు మాసములు ఇరువది దినములు

కే॥శే॥ కనుపర్తి వరలక్ష్మమ్మ

## 1


ఎటు చూచిన సుకుమారము, నాగరికత ద్యోతక మగుచుండెడిది గోపాలరావునందు. సన్నని గోరంచు ధోవతులు, మెత్తని పట్టు చొక్కాయిలు, పాము కుబుసములాగు మిసమిసలాడే జరీ ఖండువాలు తప్ప అతడు వేరొక వస్త్రమే వాడి యెరుగడు. ఎప్పుడును పాపిట చెరుగని క్రాపింగు, పాలిష్ మాయని బూడ్సులు, నల్లని ఫ్రేములో అమర్చిన గుండ్రని కంటియద్దములు, రిష్టు వాచీ గలిగి తాను జన్మించిన యున్నత కుటుంబమున కును, తాను చదివెడి యున్నత విద్యకును తగిన ఆకారమును, వర్తనమును కలిగియుండేవాడతడు. ఇంత నాగరికతగా నుండునని వర్ణించుటచే అతడు వట్టి షోకులరాయడని పాఠకులు భ్రమకు లోనగుదురేమో? వినయకారుణ్యాది గుణ విశేషములు ఆతనికి పెట్టని సొమ్ములు. సుప్రసన్నమైన అతని ఆననము సౌమ్యతకు కుదురు. మాతృదేశమనిన అతనికి పరమభక్తి. ఎవనికి దేశముపై ప్రేమయున్నదో వాడు దేశ హితైక కార్యములందు పాల్గొనకెట్లుండగలడు? మహాత్ముడు సత్యాగ్రహము నారంభించి దేశీయుల నెల్లర రండురండని ఆహ్వానించినప్పుడు ఆయన ఆహ్వానమునందుకొనిన విద్యార్థి గణములో గోపాలరావు ఒకడు. ఆతడు వరించిన కార్య క్షేత్రము విదేశ వస్త్ర బహిష్కారము.

## 2

రుక్మిణి పురిటి నిమిత్తము ఏడు మాసముల క్రిందట పుట్టినింటి కేగినది. కొమారుడు కలిగినాడు. పిల్లవానికి అయిదవ మాసము వచ్చినది. బారసాల చేసికొని భార్యను, బిడ్డను తీసికొని వెళ్ళవలసినదని మామగారు మూడవ నెలను, అయిదవ నెలను గూడ జాబులు వ్రాసినారు గోపాలరావునకు. సత్యాగ్రహోద్యమ ములో మునిగి తేలుచున్న గోపాలుడా యుత్తర ములకు జబాబియ్యలేదు. పోలేదు. రుక్మిణికి అత్తవారింటి కేగవలయుననెడి ఆతురత అధికముగా నుండుట గమనించి తలిదండ్రులు బిడ్డసారె పెట్టి రుక్మిణిని అత్తవారింటికంపినారు. తాను పుత్రవతియైనది. ఆ నమయముననే తన భర్త ఎం. ఏ. పరీక్షయందు తీర్ణుడైనాడను సమా చారము వినినది. భార్యాభర్తలు మనసు కలిసిన వారు. ఎలప్రాయముననున్నవారు. ఎన్ని ముచ్చట లుండును? తమ సుఖమయ సంభాషణలచే అధమమొక వారము దినములైనను విరామ ముండదని రుక్మిణి మదిలోని అభిప్రాయము. రైలులో పయనించినంతసేపు తమ ప్రసంగము లెట్టివిగా నుండునో ఊహించి మురియుచు, తనువుకంటె ముందుగా పెనిమిటి సన్నిధికి పరువులు పెట్టుచున్న చిత్తముయొక్క ఉరవడికి నవ్వుకొనుచు, జబాబు వ్రాయనందులకు బాగుగా నిష్ఠురములాడవలయును, పరీక్ష ప్యాసైనందుకు బాగుగా అభినందించవలయును, బారసాలకు రానందులకు బాగుగా నెగతాళి చేయవలయును అని యేవేవో జాగ్రత్స్వప్నములు. ఆకాశ హర్మ్యములు నిర్మించుకొనుచు వచ్చినది. స్టేషను వద్దనే తన భర్త ముఖారవిందము తప్పక నయనపర్వమొనర్చునని ఆమె దృఢ నిశ్చయము. రైలు దిగగానే ప్లాట్‌ఫారమంతయు కలయ చూసినది. ఆమె హృదయాకాశమున చిరు మబ్బులు ఆవరించినవి.

## 3

ఆ నాడు విదేశ వస్త్ర దుకాణముల వద్ద తీవ్రముగా పికెటింగు జరుపుటచే అలసి సొలసి మధ్యాహ్నము పదిరెండు గంటలకు ఇంటికి



వచ్చినాడు గోపాలరావు. భార్య రాకను పని తొందరలచే మరిచిపోయిన గోపాలరావు భార్యను చూచి 'అవును, యీ దినము వస్తానని వ్రాసినారు గాదూ?' అని జ్ఞాపకము తెచ్చుకొనినాడు. ఉత్తరము వ్రాయకపోయిననేమి, రైలువద్దకు రాకపోయిననేమి తన్ను చూచినప్పుడు ఉల్లాసముగా భాషింపదనునది రుక్మిణి ఊహింపని ఆపద. అప్పుడు రుక్మిణి ధరించియున్న చీర అర్టుసిల్కు, రెవిక గ్లాస్గోమల్లు. ఆమె కొమారునకు తొడిగినది గూడ విదేశపు దువ్వలువే. గోపాలరావు కన్నులలో కోపము, అసహ్యము నృత్యము సల్పినవి. మధురమందహాసము లేదు. మనోజ్ఞ భాషణములు లేవు. అడావిడిగా నాల్గు మెదుకులు నోట వేసుకొని వెళ్ళిపోయినాడు.

మగని వర్తనము రుక్మిణికి పిడుగు అడచినట్టులైనది. పచ్చ జామిపండువలె మిసమిసలాడుచు, నవ్వుచు, కేకిసలు కొట్టుచు, ఉ:అ అంటూ నల్లని ముంగురులు ముఖముపై క్రమ్ముచుండ చూచినవారినెల్ల ముద్దుల విందులకు పిలిచే పాల బుగ్గలతో నొప్పుచున్న కుమారుని క్రిందికి దింపకుండా యెత్తుకొనుననుకున్న పెనిమిటి చూపిన ఉదాసీనమునకు కారణము ఆమెకు తెలియలేదు. వేషమే మారినది. భాషే మారినది. మనిషే మారినాడు. ఈ పరిణామమునకు కారణమేమిటో రాత్రికి తప్పకుండా తెలిసికొనవలయును. అస్తమయము కొరకు సూర్యునివంక చూచుచున్నది రుక్మిణి. ఆనాడు ఆమె అన్నమును మునిపంట కొరికినది. కూర్కు అసలే యెరుగదు. తల్లియొక్క కళవళపాటుకు ఫలితముగా పిల్లవాడా దినమంతయు పోరుపెట్టి యేడ్చుచునే యున్నాడు.

## 4

రాత్రి పది గంటలకు గోపాలరావు ఇంటికి వచ్చి చొక్కా విప్పుచున్నాడు. పోలీసు సబ్ యిన్స్పెక్టరు వచ్చి "గోపాలరావుగారూ!" అన్నాడు. వెంటనే గోపాలరావు "ఎవరు" అనుచు వాకిలిలోనికి వచ్చినాడు. "గోపాలరావు గారు తమరేనా?" అని వారంటు ఉత్తరువు జారీ చేసినాడు ఇన్స్పెక్టరు. గోపాలరావు నిశ్చలుడై నిలువబడినాడు. ఆతని ముఖసీమపై ఎట్టి వికారమును కనిపించలేదు.

"ఒక గంట సైమిస్తారా?" అన్నాడు యిన్స్పెక్టరుతో. 'వీలుకాదు' – 'భోజనము చేసియైన రావచ్చునా?' – 'ఉత్తరువు లేదు' 'సరె, రెడీ' అని ఇన్స్పెక్టరు వెంట నడిచినాడు గోపాలరావు.

## 5

ఓపిక గల మేజిస్ట్రీటు ఆ రాత్రివేళగూడ కోర్టులోనే కూర్చున్నాడు. జీతము మామూలే కాని న్యాయాధికారులకప్పుడు పని మాత్రము డబుల్. పట్టుదల గల ప్రచారకుల నెంత త్వరగా ఊరినుండి తరిమివేసినంత హాయిగా నిద్ర పోవచ్చునని అధికారుల ఊహ. గోపాలరావు యిన్స్పెక్టరులు ముందూ, వారి వెనుక నిరువురు రక్షకభటులూ. మేజిస్ట్రీటు గోపాలరావును చూచి 'ఏమయ్యా! విదేశ వస్త్రములు ధరింపరాదని ప్రజలలో తీవ్ర ప్రబోధము గావించుచున్నావట గదా?'–'అవును'.

'విదేశ వస్త్రములు దహించివేయమన్నావుట గాదూ?'–'నిజమే'.

'విదేశ వస్త్రపు దుకాణముల వద్ద గుంపులు చేర్చి విదేశ వస్త్రములు కొనవద్దని ప్రజలను బాధించుచుంటివట గాదూ?'

'బాధించుట లేదు. బ్రతిమలాడుటే'.

'అయితే నీవు నేరస్తుడవే'.

'మీ దృష్టిలో'.

'డిఫెన్సు పెట్టుకుంటావా?'–'ఊహూఁ'.

'అపాల్జీ?'

గోపాలరావులోని శౌర్యరసమును వెలికి చిమ్ముచున్నట్లుగా అయిపోయినవి దృక్కులు. మేఘ గంభీరమైన నినదంతో అన్నాడు: "సత్యాగ్రహ వీరుల నిఘంటువు నుండి డిఫెన్సు, అపాల్జీ అనే పదములు తుడిచివేయబడినవి".

మేజిస్ట్రీటు చకితుడైనాడు. మాట తడబడినది. "దృష్ట్వాహిత్వాం ప్రవ్యథితాం తరాత్మాధృతిం నవిందామిశమంచవి విష్ణో' అని అర్జునుడు కృష్ణుని విశ్వరూపమును చూచి భయార్తుడై వలవలలాడిన చందమున నించుకసేపు లోలోన కొట్టుకాడినది అతని అంతరాత్మ. అయినను కర్తవ్యము తప్పదు. బిడియముతో, భయముతో గద్గదకంఠుఁడై ఆరు నెలలు కఠినశిక్ష, సి. క్లాసు అన్నాడు మేజిస్ట్రీటు.

"వందనములు" అన్నాడు గోపాలరావు.

## 6

రుక్మిణికి ఇల్లు అరణ్యమైపోయినది. ఎనిమిది నెలల క్రితము పుట్టినింటికేగి ఆ దినమే వచ్చినది రుక్మిణి. కొడుకును చూపలేదు, మాటలు మాటాడలేదు. నవ్వులు నవ్వలేదు. హాస్యములాడలేదు. తన హృదయమాతనికి తెలుపలేదు,



సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ తమ 82వ ఏట, ఆగస్టు 13వ తేదీన బాపట్లలో మరణించారు. ఆమె ఎన్నో కథలు రాశారు; నవలలు రాశారు. 'గృహలక్ష్మి స్వర్ణకంకణం' పొందిన తొలి వనిత (1934) ఆమే. ఆమె సంస్మరణార్థం 47 సంవత్సరాల క్రితం ఆమె రాసిన "ఐదు మాసముల ఇరువది దినములు" అన్న కథను – ఇక్కడ ప్రచురిస్తున్నాము. ఈ కథ 1931 అక్టోబర్ 'గృహలక్ష్మి'లో ప్రచురింపబడిన కథ.

అతని హృదయము తాను తెలిసికొనలేదు. హా! ఎట్టి యుత్కంఠ కెట్టి విఘాతము? పెనిమిటి శిక్ష వర్తమానము విని పిడుగడచినట్లు నేలగూలిపోయినది రుక్మిణి.

“ఎండకోర్వలేదు. ఆకలికోర్వలేదు. కష్టమైన పని చేయలేదు. గరగర నేతిలో వేగిన కూరలుగాని పనికిరావు. మెత్తని పక్కపై గాని మేనువాల్చడు. బజారునుండి ఒక్క వస్తువు తేరా బాబూ! అంటే అభిమానము, సిగ్గు. ఇటువంటివాడివే, నా తండ్రీ! ఈ ఆరు నెలలు ఆ చెరలో ఎట్లు గడపి వస్తావురా? మా కన్నులెప్పుడు చల్లబరుస్తావురా?” అని తల్లిదండ్రులు గోల. అన్నాలు లేవు, నీళ్ళు లేవు. మిన్ను విరిగి మీదబడ్డట్టయినది ఆ సంసార స్థితి.

## 7

రుక్మిణి సిరిగల యింట బుట్టినది. ఆమె తండ్రి గొప్ప ఉన్నతోద్యోగి. కాన స్వార్థప్రేరితమైన రాజభక్తి వారి చిత్తములకు పెట్టని కోట. బహిర్ప్రపంచములోని వ్యవహారములు వారి చెవికి చేరవు. పేదసాదల కష్టనిష్ఠురములు, విదేశ వస్తువులవలని యనర్థకములు, పరాధీన భారతదేశపు అగచాట్లు వారెప్పుడును వినిన సంగతులుగావు. ఇంటిలోని ఆడవారు నల్గురు ఒక్కచోట కూర్చుండినచో వారి ప్రసంగ విషయములు చీరలు, నగలు, కాకపోతే పిండి వంటలు, వేపుడు కూరలు, కాఫీలు, టీలు. ఇట్టి భోగ ప్రపంచములో పుట్టి పెరిగినదగుటచేత రుక్మిణి జ్ఞానముగూడ వీనికి మించలేదు. సత్యాగ్రహోద్యమముచే దేశమట్టుడికినట్లుడికిపోవుచున్నను వానిని గురించి ఆమె కొంచెముగూడ విచారించి యుండలేదు. నేడు తన దేశమునందు తయారైన వస్త్రములను దాను ధరించి యితరులను గూడ ధరింపుడని ప్రబోధించినందులకు తన మగనికి దొంగలకు, దోపిడిగాండ్రకు, హంతకులకు వేసినట్లు కఠినశిక్ష వేసినారని విని రుక్మిణి ఆశ్చర్యచకితురాలైపోయినది.

“ఏమి? మనదేశపు గుడ్డ మనము కట్టుకొనుట గూడ తప్పేనా? నేడిదైనది. రేపు మీకు గావలసిన ఆహారపదార్థములను మేమే పచనము చేసి పంపెదముగాని మీరు తయారు చేసికొనరాదనినచో మన ప్రొయ్యిలు తవ్వివేసికొనవలసినదేనా? ఎంత అధమపు బ్రతుకు. నా పెనిమిటి నాతో మాట్లాడలేదని యెంతో వేదన పడితిని. కాని కారణము తెలిసికొనలేకపోతిని. నేను, పిల్లవాడు ధరించియున్న విదేశ వస్త్రములే వారికి అసహ్యకారణమై యుండవలయును. విదేశ వస్త్రములలో నైసూ, నాజూకూ ఉన్నదనుకొనుచుంటిమిగాని వానిలో ఇంత పరాధీనత యున్నదని గమనించలేదు. ఛీ! నా పతికి అప్రియములగుటయేగాక శిక్షహేతువులైన ఈ విదేశ వస్త్రములు నాకేల?” అని యోచించి తక్షణమే రుక్మిణి తన చీనిచీనాంబరములకు నెలవొసంగినది. ఆమె ఇప్పుడు ఖద్దరు వస్త్రధారిణి. ఏ హార్మోనియము వాయిద్యమో, ఫిడేలు వాయిద్యమో వినబడుచుండెడిది రుక్మిణి మేడమీద గదిలో మునుపు. ఇప్పుడు ఎల్ల వేళల రాట్నపు నినదము.

## 8

గోపాలరావు బళ్ళారి జెయిలులో శిక్షననుభవించుచున్నాడు. జెయిలులో భోజనము సరిపడలేదనియు, చాల చిక్కిపోయినాడనియు, జిగట విరేచనములు పట్టుకొనినవనియు, ప్రదేశము మార్చినారనియు, యేవేవో వార్తలు వచ్చుచున్నవి గాన తండ్రి, మామగార్ల బలవంతముచే గోపాలరావు క్షమాపణ యిచ్చి వచ్చునను వార్తను మాత్రము కలలోని వార్త చేసినాడు గోపాలరావు. రుక్మిణికి వేరు పనిలేదు. ఆమె చిత్తము పెనిమిటి మీద, చేయి రాటము మీద. గోపాలరావు జైలుకు వెళ్ళి దాదాపు అయిదు మాసములైనది. ఈ అయిదు నెలలలో ఆమె పెనిమిటి కొరకొక ఉత్తరీయముల జతను, ధోవతుల జతను, ఒక చొక్కా తానును తన సొంత దారముతో నేయించియుంచినది. అల్లుడు చెరసాల ప్రవేశము విని నంతనే తండ్రి వచ్చి, “అమ్మాయీ! ఇక నీవు ఇక్కడెందుకు? అతను వచ్చినదాకా మన యింట్లోనే ఉందుగాని రా” అని రుక్మిణిని పిలిచినాడు. రుక్మిణి జబాబు చెప్పలేదు. చెక్కిళ్ళపై దిగజారిన కన్నీళ్ళను గోటికొనలతో చిమ్ముకొని, పైట చెఱగుతో తడి తుడిచికొనినది. తండ్రి మరల ఆ ప్రస్తావన చేయలేదు.

## 9

సంక్రాంతి పండుగ వచ్చినది, వెళ్ళినది. కాని మువ్వంతు యిండ్లలో ఆ యేడు పండువు లేదు. ఇంటింట తండ్రియో, కొమరుడో, తోడబుట్టినవాడో, అల్లుడో ఎవరో ఒకరు చెరసాల క్లేశమనుభవించుచున్నప్పుడు పండుగుపై ప్రేమ యెవరికి?

రుక్మిణి అత్తవారింట యెన్ని వత్సరముల నుండియో సావిత్రీగౌరిని ప్రతిష్ఠించుట వాడుక. “నీకిష్టమైతే ఈ యేడుగూడ అమ్మవారిని పెట్టి నోమునోచుకో అమ్మా! అమ్మవారి నోము మానుకోడమెందుకూ?” అన్నది వాళ్ళత్తగారు రుక్మిణితో. భర్తకు శుభములగూర్పజేయు నా వ్రతమును జరుపుటకు రుక్మిణికిగూడ కుతూహలము గలిగినది. కాని సావిత్రీగౌరీ వ్రతము ఒక్కరు చేయునదికాదుగదా, చాలామంది కలిసి నోచుకొనవలెను. తమయింట సావిత్రీగౌరిని పెట్టితిమని తెలిసినచో ఈయేడుగూడ పెక్కుమంది యువతులువచ్చి నోచుకొనెదరని ఆమెకెరుకయే. అయితే వారు తొల్లిటివలె విదేశవస్త్రముల ధరించి వచ్చి నోము నోచుకొనినచో తాను పతికి హితమైన వ్రతము జరిపినదెట్లగును? రుక్మిణికి గల్గిన ఈ సందియము నిట్లుపూరించినది. “ఈవత్సరము మాయింట నోము నోచుకొనువారు ఖద్దరు వస్త్రములు ధరించియే నోచుకొనవలయును” అని నోము నోచుకొన నెంచువారికి కబురంపినది. ఈ నియమమునకు బద్ధులు కాలేకపోవుటచే రుక్మిణియింట నోము నోచుకొనువారు కొద్దిమందియైనారు. రుక్మిణి నిరుత్సాహము జెందలేదు. ఆ కొద్ది మందితోనే సావిత్రీ గౌరీవ్రతమారంభించినది.

## 10

సావిత్రీగౌరినిపెట్టి నాటికి ఎనిమిది దినములు. సావిత్రీపూజాతత్పరలగు నారీరత్నములతో సావడి కలకలలాడిపోవుచున్నది. తెల్లవారితే తొమ్మిది దినములు. వ్రతము ముగియును. దేవికుద్వాసము చెప్పబడును. కాన ఆ యెనిమిదవనాటి రాత్రి సావిత్రీదేవియొక్క యుజ్వలరూపము దర్శనీయము. కడపటి దినమగుటచే ఆ దినము నోము నోచుకొనెడివారేగాక చూడవచ్చిన పేరటాండ్రుగూడ గుంపులుగుంపులే. వారము దినములనుండి ప్రాతస్సంధ్యల సల్పిన పూజలచే నాడు దేవీరూపము పసుపుకుంకుమముల కుప్ప, పుష్పాక్షతలరాసి. ఆమె చుట్టు భక్త్యుత్సాహములతో వినమ్రలై దేవినర్చించు తొయ్యలులు. ఎక్కడ జూచిన దీపములు! ఎక్కడ జూచిన పిండి మ్రుగ్గులు! ఎక్కడ జూచిన పసుపుకుంకుమలు! ఎక్కడ జూచిన గంధాక్షతలు! ఎక్కడ జూచిన అగరుధూమములు! ఎక్కడ జూచిన పుష్పములు! ఎక్కడ జూచిన కర్పూరనీరాజనములు! ఎక్కడ జూచిన నివేద్యపదార్థములు! అహో! ఆ రాత్రి

వేళ, ఆ దీపముల సన్నిధిని, ఆ దేవీమూర్తి యెదుట శుద్ధ ఖద్దరు వస్త్రధారిణులై నిశ్చలదీక్షతో దేవినర్చించుచున్న యామానవతీమానసములలో ఎట్టి భావములు, ఎట్టి ఆకాంక్షలు, ఎట్టి సంకల్పములు ఉద్భూతమై దేవికి నివేదింపబడుచున్నవో యెవరికెరుక?

## 11

నాటికి గోపాలరావు ఖైదుకు వెళ్ళి అయిదు నెలల ఇరువదిదినములు. తక్కిన పదిదినములు వ్రేళ్ళపై లెక్కించుచున్నది రుక్మిణి. కాని గోపాలరావు తన సత్ప్రవర్తనచే శిక్షాకాలములో పదిరెండు దినములు ముందుగనే విడుదలయైవచ్చునని ఆమెకేమి తెలియును? రాత్రి యెనిమిదిగంటలకు పడమటినుండివచ్చు బండివచ్చినది. వెళ్ళినది, వెళ్ళుచు కూతగూడ బెట్టినది. ఎవరును వినలేదు. తమ సావిత్రీపూజాసంరంభములో ఆ యువతుల కీరైలు రాకపోక లేమియెరుక '

రైలువచ్చి వెళ్ళిన ఇరువది నిముసములకు–ఇంటినిండ క్రిక్కిరిసియున్న నారీమణులలో–'గోపాలరావుగారు వచ్చినారు, గోపాలరావుగారు వచ్చినారు' అని ఒక చిన్న కలకలము పుట్టి రుక్మిణి చెవికెక్కినది. ఎక్కుటయేతడవు. ఇక ఆమె మోదనారాశికి పారమెక్కడ? దేవికై కూర్చిన కుసుమమాలలు ఒరులకై వినియోగింపవచ్చునా అను ఆలోచనయేదీ? ఆమె దృష్టిలో పతియు దైవమే. దేవికి సమర్పించుటకై కూర్చియుంచిన కుసుమమాలికను కరములగైకొని యొక్కయుదుటున పతిసందర్శనమున కేగినది రుక్మిణి. చేతనున్న పుష్పమాలను చేతికందించునో కంఠసీమనలంకరించునో, చరణయుగళిపై సమర్పించునో–రుక్మిణి మనస్సంకల్పమప్పుడెట్లుంగినున్నదో కాని కుసుమమాలికా కీలితకరాబ్జయై మహోత్కంఠతో నేతెంచు రుక్మిణి నల్లంతనే చూచినాడు గోపాలరావు. తనువు కృశించినది. జవము సడలిపోయినది. మారురూపుపడిపోయినాడు. కాని యుజ్జ్వలములైన ఆ నేత్రములలో దీపించు ఆ దేశభక్తికి తరుగు ఒరుగులులేవు. 'రుక్మిణీ! ఆ పూలదండ సీమనూలుతో గట్టినదేమో, నేను ముట్టను' అన్నాడు గోపాలరావు. అనిశితశరాపాతము వంటి వాక్యప్రయోగమున కుపహతినొంది నేలగూలుటకు రుక్మిణి మునుపటి రుక్మిణియా? కాదు. ఆయోధపత్ని ఇట్లు ధీరతతో జబాబిచ్చినది; ''సీమనూలు నాచేతినుండి తొలగి అయిదు మాసముల యిరువది దినములు.'' □



# 'రేడియో' భానుమతి

మీరు మద్రాసు కేంద్రంలో తయారై ప్రసారితమయ్యే రేడియో కార్యక్రమాలు వింటూ వుంటారా....అయితే మీకు ఒక చక్కటి స్వరం స్వాగతం పలుకుతూ వుండాలే....నాలుగు దశాబ్దాలుగా ఆ కంఠస్వరం మద్రాసు ప్రాంతపు తెలుగు వారినే కాక ఆ కార్యక్రమాలు వినే అఖిలాంధ్ర కోటి శ్రోతలను అలరిస్తోంది. ఇంతకీ ఆ కంఠస్వరం ఎవరిదో యిప్పటికి మీరు గ్రహించే వుంటారు-'రేడియో భానుమతి' గారిది అని.

నలభై సంవత్సరాలుగా రేడియో కార్యక్రమాల్లో వివిధ రకాలుగా పాల్గొంటూ రావడం సామాన్యమైన విషయం కాదు. అందుకే ఆమె 'రేడియో భానుమతి' ఐంది. మద్రాసులో రేడియో పుట్టినప్పటి నుంచి అంటే – జూన్ 16, 1938 నుంచి ఆమె అందులో పని చేస్తూనే వున్నారు. అందుకే ఆమె 'రేడియో కార్యాలయమే నా పుట్టిల్లు' అని చమత్కరిస్తూ వుంటారు.

భానుమతిగారి స్వస్థలం బరంపురం. స్కూల్ ఫైనల్ వరకు చదువుకున్నారు. బాల్యం నుంచి లలిత కళలంటే అభిమానించేవారు భానుమతి. మురళీ నాదంలో మ్యూజిక్ అకాడెమీ ద్వారానూ, వయలిన్, వీణలలో మదరాసు విశ్వవిద్యాలయం 'డిప్లొమా'లూ పొందారు. ప్రారంభంలో ఆలిండియా రేడియోలో ఫ్లూటిస్ట్‌గా వుండేవారు. ఆమె అప్పట్లో నాటకాలలో వేషాలు వేశారు కూడా. ఒకసారి ఆమె ముద్దుకృష్ణగారి 'అనార్కలి' నాటకంలో అనార్కలి వేషం వేశారు. ''ఆ నాటకంలో సలీం పాత్రధారి ఎవరో తెలుసా .... దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు!'' అన్నారామె.

ఆమె భర్త పుణ్యావధుల సీతారామ బ్రహ్మంగారు, అప్పుడు ఆంధ్రప్రభ సంపాదకవర్గంలో పని చేసేవారు. 'ఆయన్ని భర్తగా పొందడం నా అదృష్టం' అని చెప్పే భానుమతి దంపతులకు ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి. పెద్దమ్మాయి దుర్గాదేవి మదరాసు కూచిపూడి ఆర్ట్స్ అకాడెమీలో నాట్యం నేర్పుతున్నారు; రెండో అమ్మాయి జ్యోత్స్న–హైద్రాబాదు ఆకాశవాణి వ్యాపార విభాగంలో ఎనౌన్సర్‌గా పని చేస్తున్నారు. వారి కుమారుడు విశ్వనాధరావు మద్రాసు రేడియోలో ఫ్లూటిస్ట్‌గా వుంటున్నారు.

''ఆ రోజుల్లో రేడియో ఆర్టిస్ట్ అంటే ఎంతో ఘనంగా వుండేది. నేను నలభైరూపాయల జీతంతో దాదాపు నలభైఏళ్ళ క్రితం చేరాను. అప్పట్లో అన్నీ అప్పటికప్పుడు ప్రసారితమయ్యే కార్యక్రమాలే వుండేవి. ఈ రోజుల్లో లాగా ముందుగా టేప్ చెయ్యడం ఆ తరువాత ప్రసారం చెయ్యడం అంటూ వుండేది కాదు. అందుకే అప్పట్లో మాకు వృత్తిపట్ల భయం, భక్తి, శ్రద్ధ అధికంగా వుండేవి. కాని దురదృష్టవశాత్తు ఇప్పటితరంలో అంత ఓర్పు, శ్రద్ధ కనిపించడం లేదు'' అన్నారు భానుమతి.

మద్రాసు రేడియోలో తెలుగు కార్యక్రమాల గురించి ప్రస్తావన రాగా 'అసలు ఇక్కడ రేడియో కార్యక్రమాలు రూపొందించింది ఆంధ్రులే. నేటికీ ఈ నగరంలో దాదాపు ఎనిమిది లక్షలమంది తెలుగువారు వున్నారు. అయినా ఆదివారాలు, అడపాతడపా ప్రసారమయ్యే కొన్ని కార్యక్రమాలు తప్పించి తెలుగులో ప్రసారమయ్యే కార్యక్రమాలు రోజుకి అరగంట మాత్రమే. అదీ ఈ మధ్య ఉదయం 8–20కి మార్చబడింది. గృహిణికి క్షణం తీరిక లేని సమయం అది. పిల్లలను పాఠశాలలకి, భర్తను ఆఫీసుకి పంపడంలో నిమగ్నమయ్యే గృహిణి యిక ఆ కార్యక్రమాలు ఏం వినగలదు? 'అసలు ఇవి ఎవరికోసం నిర్దేశించబడినట్లు?' అని నన్ను చాలా మంది అడుగుతున్నారు. వారికి నేనేం సమాధానం చెప్పగలను? తెలుగువారందరూ సంఘటితమై ఈ విషయంపై వత్తిడి తీసుకువస్తే గానీ – ఆ కార్యక్రమాలు అందరూ వినడానికి అనువైన సమయానికి మార్చడం జరగదు—అనడం కన్న నేనేం చెప్పగలను?'' అన్నారు భానుమతి ఈ విషయంపై తన నిస్సహాయతను తెలియజేస్తూ. □